క్లుప్తంగా

పేద విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



బలిజిపేట ఉన్నత పాఠశాలలో పంపిణీ చేసిన సైకిళ్లు

బలిజిపేట: మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నలుగురు పేద విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకటనాయుడు తెలిపారు. వసుధైక కుటుంబం యూనివర్సల్ ఫ్యామిలీ, కెనరా బ్యాంకు వారి ఆర్థిక సాయంతో వాటిని పంపిణీ చేశామన్నారు. ఆర్థికంగా వెనుకబడిన, తల్లిదండ్రులు లేని విద్యార్థులు లేదా తల్లి లేదా తండ్రి లేని విద్యార్థులను అర్హులుగా గుర్తించి వారిపేర్లు పంపగా వారిలో 6,7తరగతులకు చెందిన నలుగురు విద్యార్థులకు సైకిళ్లు మంజూరవగా వాటిని సోమవారం అందజేశామన్నారు. పుణ్యవతి మేడమ్ కృషితో సైకిళ్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త కుండీల నుంచి చెత్త తొలగింపు



జేసీబీ సహాయంతో ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్న చెత్త

సాక్షి ఎఫెక్ట్...

పాచిపెంట: మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తకుండీలో సమీప ఇళ్ల ప్రజలు వేసిన తడి, పొడి చెత్త నెలల తరబడి డంపింగ్ యార్డుకు తరలించడం లేదు. దీంతో చెత్త పేరుకుపోయి దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని 'చెత్త కుండీల నుంచి చెత్త తొలగించండి' శీర్షికన ఈనెల 9న సాక్షిలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఈ మేరకు సోమవారం జేసీబీ సహాయంతో పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా చెత్త కుండీల్లోని చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించారు.

వృథాగా తాగునీరు

- చెప్పినా పట్టించుకోని సెక్రటరీ



మరమ్మతుల బారిన పడిన తాగునీటి పైపు

సాలూరు రూరల్: మండలంలోని కూర్మరాజుపేట పంచాయతీ పునికినివలస గ్రామంలో నెల రోజులుగా తాగునీరు పైపులు పూర్తిగా లీకు అవుతున్నాయి. ఈ విషయమై గ్రామ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మంచినీటి ట్యాంక్‌ను పూర్తిగా నింపడానికి నాలుగంటల సమయం పడుతుంటే అరగంటలో ఖాళీఅయిపోతోందని దీంతో గ్రామస్తులకు మాటిమాటికి మోటారు వేయాల్సి వస్తోందని తెలిపారు. కష్టముండే తాగునీరు వృథా అవుతుంటే బాధాకరంగా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. అంతేకాకుండా పైపులు లీకైన ప్రాంతంలో మురుగునీరు పైపుల్లోకి చేరుతోందని చెబుతున్నారు.

ఘనంగా మోక్షగుండం జయంతి



మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న పంచాయతీ ఇంజినీరింగ్ అధికారులు

పార్వతీపురం రూరల్: ఇంజినీరింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ కార్యాలయం ఆవరణలో గల పంచాయతీ ఇంజినీరింగ్ కార్యాలయం వద్ద ఉన్న ఇంజినీరింగ్ పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి సోమవారం పంచాయతీ ఇంజినీరింగ్ అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ దినోత్సవ శుభాకాంక్షలు ఒకరికొకరు తెలుపుకున్నారు. కార్యక్రమంలో భాగంగా పేదలకు ఆహార పొట్లాలు, వైద్యశాలలో ఉన్న రోగులకు పండ్లు, రొట్టెలు, పాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విశ్రాంత డీపీఆర్ ఈఓ ఎంవీఆర్ కృష్ణాజీ, ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణరావు, కార్యదర్శి చంద్రమౌళి, జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

హరిరెడ్డి ఫిర్యాదుపై విచారణ

సాలూరు: పట్టణంలోని వెంకటేశ్వర ఆలయ కమిటీ డైరెక్టర్ పేర్ల విశ్వేశ్వరరావుపై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు నమోదైంది. విశ్వేశ్వరరావు దేవాదాయభూములు చౌకగా కొనుగోలు చేస్తున్నారని, ఆయనపై పలు భూవివాదాలకు సంబంధించిన కేసులు ఉన్నాయని అటువంటి వ్యక్తిని ఆలయ కమిటి సభ్యుడిగా ఎలానియమిస్తారని సామాజిక కార్యకర్త నైన హరిరెడ్డి కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణలో భాగంగా ,ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై సమాధానం ఇవ్వాలని విశ్వేశ్వరరావుకు సోమవారం తాను తెలియజేసినట్లు ఆలయ ఈఓ రమేష్ తెలిపారు. ఈ సమాధానం ఇవ్వడానికి రెండు రోజులు సమయం కావాలని ఆయన కోరినట్లు చెప్పారు.

అద్దె భవనాల్లో సచివాలయాలు

- సొంత భవన నిర్మాణాలకు నీలినీడలు
- పంచాయతీ ద్వారా అద్దె చెల్లించలేమంటున్న సర్పంచులు



కేవలం 10శాతం పనులు పెండింగ్ ఉండడంతో ప్రారంభానికి నోచుకోని కేరంగి సచివాలయ భవనం

పాచిపెంట: పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలన్న ముందు చూపుతో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. అయితే సచివాలయ వ్యవస్థ ఏర్పడి సుమారు ఆరు సంవత్సరాలు కావస్తున్నా ఇంకా అద్దె భవనాల్లోనే కార్యాలయాలు కొనసాగుతున్నాయి, గత ప్రభుత్వ హయాంలోనే సచివాలయ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేసి పనులు కూడా ప్రారంభించారు. కొన్ని చోట్ల భవన నిర్మాణాలు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చారు. మరికొన్నిచోట్ల వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, కనీసం ఆ భవన నిర్మాణాలపై దృష్టి సారించకపోవడంతో ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా భవన నిర్మాణాలపై నీలి నీడలు కమ్ముకున్నాయి, దీంతో మరో గత్యంతరం లేక అద్దె భవనాల్లోనే సచివాలయాలు కొనసాగిస్తున్నారు. పంచాయతీలకు వచ్చే జనరల్ ఫండ్ ద్వారా అద్దె చెల్లిస్తున్నారు. కొన్ని గిరిజన ప్రాంతాల్లో చిన్న పంచాయతీలకు జనరల్ ఫండ్ తక్కువగా వస్తాయి. అందులో కొంత డబ్బులు సచివాలయ భవనాలకు అద్దె చెల్లించడానికి సరిపోతున్నాయని, పంచాయతీలో మిగతా మౌలిక వసతులు కల్పన వీధిలైట్ల నిర్వహణకు నిధులు చాలడం లేదంటూ పలువురు గిరిజన సర్పంచులు వాపోతున్నారు. ప్రభుత్వం అలసత్వాన్ని వీడి సకాలంలో భవన నిర్మాణాలు పూర్తి చేసి పంచాయతీలపై అద్దె భారాన్ని తగ్గించాలని కోరుతున్నారు.



చిన్నపాటి అద్దె భవనంలో విధులు నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది

90శాతం పనులు పూర్తి



పాచిపెంట మండలం, కెరంగి పంచాయతీ, మా పంచాయతీ పరిధిలో గ్రామ సచివాలయ భవననిర్మాణ పనులు 90 శాతం పూర్తి అయిపోయాయి, కానీ ప్రారంభానికి నోచుకోలేదు, అద్దె భవనాల్లోనే సచివాలయం కొనసాగిస్తున్నాం, చిన్న పంచాయతీ కావడం వల్ల జనరల్ ఫండ్ తక్కువగా వస్తున్నాయి. అందులో సగం డబ్బులు అద్దె చెల్లించేందుకు సరిపోతున్నాయి, మౌలిక వసతుల కల్పన, వీధిలైట్ల నిర్వహణ కష్టంగా మారుతోంది. కొన్ని సమయాల్లో పంచాయతీల్లో డబ్బులు లేక సకాలంలో భవనాల అద్దె చెల్లించకపోవడంతో, అద్దెకిచ్చిన యజమానులు అద్దె చెల్లించాలని, ఒత్తిడి చేస్తున్నారు. దీంతో ఇబ్బందులకు గురవుతున్నాం, ప్రభుత్వం స్పందించి మిగతా10 శాతం పనులు పూర్తి చేసి, సచివాలయ భవనాన్ని ప్రారంభించి, అద్దె భారాన్ని తగ్గించాలి...

– సోముల లచ్చయ్య, సర్పంచ్, కేరంగి గ్రామం

పల్లెపండగలో ఇచ్చిన హామీలు అమలుచేయాలి



ఎంపీడీఓ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న రెడ్డివానివలస గ్రామస్తులు

సీతానగరం: ప్రభుత్వం నిర్వహించిన పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా రామవరం పంచాయతీ మధుర గ్రామం రెడ్డివానివలస ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం దుర్మార్గమైన చర్య అని ఉపసర్పంచ్ రెడ్డి లక్ష్మునాయుడు అన్నారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయం ఎదుట రెడ్డివానివలస గ్రామస్తులు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా లక్ష్మునాయుడు, గ్రామ పెద్ద ఆర్వీ రమణమూర్తి మాట్లాడుతూ గ్రామంలో వివిధరకాల సమస్యలతో ఆరోగ్యరీత్యా, తాగునీరు, రాకపోకల సమస్యలతో అవస్థలుపడుతున్నామని ఈ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని పల్లెపండగ గ్రామ సభకు వచ్చిన నాయకులు, అధికారుల దృష్టికి తెచ్చామన్నారు. ప్రధానంగా గ్రీన్‌అంబాసిడర్లకు పని కల్పించకపోవడంతో వీధుల్లో చెత్తకుప్పలు పేరుకు పోతున్నాయని అన్నారు.అలాగే జగనన్నకాలనీ రహదారిలో కాలువ వేస్తామని చెప్పినా ఇంతవరకూ పనులు మంజూరు కాలేదన్నారు. ప్రధాన వీధులకు సంబంధించి కాలువ, బీటీరోడ్డు ఎత్తు పెంచడంతో కాలువలన్నీ రేజ్ చేస్తామని హామీ ఇచ్చారని ఇంతవరకూ అమలు కాలేదన్నారు. గ్రామంలో పారిశుధ్యలోపం తాండవించడంతో గ్రామస్తులంతా విషజ్వరాల బారిన పడి వైద్యంకోసం వేలాది రూపాయల వంతున ఒక్కో ఇంటినుంచి బొబ్బిలి, పార్వతీపురం ఇతర కార్పొరేట్ ఆస్పత్రులకు చెల్లించామని వాపోయారు. గ్రామసభల్లో ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయనందుకు, గ్రీన్‌అంబాసిడర్లను పునరుద్ధరించి పారిశుధ్య పనులు నిర్వహించనందుకు నిరసనగా ధర్నా చేయాల్సి వచ్చిందన్నారు. తక్షణమే సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరుతూ ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.కుమారవర్మకు గ్రీవెన్స్‌సెల్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, వెంకటనాయుడు, రాఘువ, సత్యనారాయణ, శంకరరావు పాల్గొన్నారు.

ఫ్యాప్టో ధర్నా విజయవంతం చేయండి



పలగర పాఠశాల వద్ద మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శేషగిరిరావు

బలిజిపేట: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చేనెల 7వ తేదీన విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శేషగిరిరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని పలగర మోడల్ ప్రైమరీ పాఠశాల వద్ద సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15నెలలు పూర్తయినప్పటికీ హామీలు అమలు చేయలేదని వాటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఏకీకృత సర్వీస్ రూల్స్ వెంటనే అమలు చేయాలని, 12వ పీఆర్‌సీని ఏర్పాటుచేసి తక్షణమే ఐఆర్ 30శాతం ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న 4డీఏలు రిలీజ్ చేయాలన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనులనుంచి విముక్తి చేయాలని, ఆరోగ్య సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. సమస్యలను పరిష్కరించేవరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక సంఘాలు పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, ఎస్.రాంబాబు, వై.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి



తహసీల్దార్ కార్యాలయం వద్ద అధికారికి మెమొరాండం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు

సాలూరు: సమస్యలు పరిష్కరించకుండా అలసత్వం వహిస్తున్న కూటమి ప్రభుత్వంపై ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తిగా ఉన్నారని ఏపీటీఎఫ్ నాయకులు చంద్రశేఖర్, ప్రసాద్‌రావు తదితరులు అన్నారు. తమ సమస్యల పరిష్కారానికి ఏపీటీఎఫ్ సాలూరు పట్టణ, మండల యూనియన్ నాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే విడుదల చేయాలి. సీపీఎస్ రద్దు చేయాలి. మెమోనంబర్ 57ను తక్షణం అమలుచేయాలి. 12వ పీఆర్‌సీని నియమించి ఐఆర్ ప్రకటించాలి. అన్ని రకాల బకాయిలు చెల్లించాలి. ఈహెచ్ఎస్ పరిమితిని రూ.25లక్షలకు పెంచాలి. యాప్‌లు, అసెస్మెంట్ బుక్‌లెట్ విధానాలను రద్దుచేసి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వ ప్రధానకార్యదర్శికి తెలియచేయాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు మెమొరాండం అందించారు.

ఎఫ్ఎండీ టీకాలు వినియోంచుకోవాలి

పార్వతీపురం రూరల్: మండల పరిధిలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఆవులు, దూడలు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ(ఎఫ్ఎండీ) టీకాలు వేయనున్నట్లు మండల పశు వైద్యాధికారి చక్రధర్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పాడి సంపద కలిగిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం నుంచి నెలరోజుల పాటు ఈటీకాల కార్యక్రమం ఉంటుందని, పాడి రైతులు తమ పశువులకు వినియోగించుకోవాలన్నారు. మండల పరిధిలో 17వేల పశుసంపద, లెక్కల్లో ఉన్నాయని, వాటన్నింటికీ టీకాలు వేసేందుకు కార్యాచరణ చేశామన్నారు. గాలికుంటు వ్యాధి లక్షణాలు ఆవుల్లో తీవ్రంగా ఉన్న క్రమంలో పాల ఉత్పత్తి తగ్గడం, జ్వరం రావడం, నోటిపై ఇన్‌ఫెక్షన్లు వంటివి పశువుల్లో కనిపిస్తాయని, ఈ లక్షణాలను సంబంధిత రైతులు గమనించి మేలుకోవాలని హితవు పలికారు. ఎమ్మార్‌నగరం వైద్యశాల పరిధిలో ఎమ్మార్‌నగరంతో పాటు గంగాపురం, వెంకంపేట, సంగంవలస, పెదమరికి ప్రాంతాలకు మంగళవారం టీకాల పంపిణీకి సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు మండల పశు వైద్యాధికారి చక్రధర్ తెలిపారు .

24 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ



మనగ్రోమోర్ గోదాంలో ఎరువులు పంపిణీ చేస్తున్న ఏఓ అవినాష్

సీతానగరం: మండలంలోని రైతులకు అవసరమైన యూరియా పూర్తి స్థాయిలో పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని రెండు రోజుల్లో ఎరువులు ఆర్ఎస్కేలకు రానున్నాయని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలోని మనగ్రోమోర్ ఎరువుల విక్రయ కేంద్రం ద్వారా 20 గ్రామాల రైతులకు 24 మెట్రిక్ టన్నుల యూరియాను సోమవారం పంపిణీ చేశామని తెలిపారు. మరో రెండు రోజుల్లో రైతులకు అవసరాలకు అనుగుణంగా యూరియా పంపిణీ చేయనున్నామన్నారు. రైతులు ఒక్కొక్కరికీ 1 లేదా రెండు బస్తాల యూరియా వంతున మనగ్రోమోర్‌లో వ్యవసాయ సిబ్బంది రైతు ఆధార్, వన్‌బీ ఆధారాలను పరిశీలించి పంపిణీ చేసినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో మనగ్రోమోర్ బ్రాంచి మేనేజర్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న పీసీ జయలక్ష్మి

సీతానగరం: మహిళల అక్రమ రవాణా, బాల్యవివాహాల నిర్మూలనకు అందరూ సహకరించాలని స్థానిక ఉమెన్ పోలీస్ జయలక్ష్మి అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని మహిళా వెల్ఫేర్ సొసైటీ కార్యాలయం వద్ద సీఈఓ జి.పద్మావతి ఆధ్వర్యంలో సోమవారం రెడ్ అలర్ట్ మై చాయిస్ ఫౌండేషన్, మహిళా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గ్రాస్ రూట్స్ టేక్‌హోల్డర్స్ ట్రైనింగ్ ప్రోగ్రాం, అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు, అక్రమ రవాణా, అసంఘటిత కార్యక్రమాలు, వరకట్న వేధింపుల నిర్మూలన ఇతర అంశాలపై అవగాహన కల్పించుకోవాలని హితవు పలికారు. సీఈఓ జి.పద్మావతి మాట్లాడుతూ తమసంస్థల ద్వారా ప్రతి గ్రామంలో నలుగురు కార్యకర్తలను గుర్తించి మానవ అక్రమ రవాణా నిర్మూలనపై కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. నోడల్ టీచర్. కమ్యూనిటీ లీడర్, గ్రామ మిత్ర, రక్షక్ ఇలా ప్రతి గ్రామాల్లో సురక్షిత గ్రామ జ్యోతి కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్, మహిళా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, గ్రామస్తులు, యువత పాల్గొన్నారు.

రైతన్నలకు యూరియా కష్టాలు



ఆటోలో యూరియాను మడకవానివలస గ్రామానికి తీసుకువెళ్తున్న రైతులు



ద్విచక్రవాహనంపై బస్తా యూరియాను పుట్టూరు గ్రామానికి తీసుకువెళ్తున్న లక్ష్మణరావు

పార్వతీపురం రూరల్: రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. ఇచ్చిన ఒక బస్తా యూరియాను తరలించడానికి రైతులకు అదనపు భారం పడుతోంది. ప్రతిరోజూ తమ పంట పొలాలకు కావల్సిన యూరియా ఎక్కడా దొరుకుతుంతో అన్న యాతనలో పడి మరికొంత భారాన్ని భరిస్తూ పట్టణాల వరకు వచ్చి పడిగాపులు కాస్తూ ఆటోల్లో, ద్విచక్ర వాహనాలపై ఇచ్చిన ఒకబస్తా యూరియాను తన అవసరం మేరకు అదనపు వ్యయాన్ని భరిస్తూ గ్రామానికి తీసుకువెళ్తున్నారు. సోమవారం పార్వతీపురం పట్టణానికి దాదాపు 16 నుంచి 20 కిలోమీటర్ల పరిధిమేర దూరంలో ఉన్న మడకవానివలస, పుట్టూరు తదితర గ్రామ రైతులు ఉదయం వచ్చి పట్టణ శివారులో ఉన్న గ్రోమోర్‌కు వెళ్లి గంటల తరబడి వేచి ఉన్న అనంతరం ఒక్కరికి ఒక బస్తాను మాత్రమే ఇచ్చారని ఆ బస్తాను తీసుకు వెళ్తున్నామని తెలిపారు.

ఉత్తమ పౌర సమాజ నిర్మాణమే జన విజ్ఞాన వేదిక లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి కృష్ణాజీ

పార్వతీపురంటౌన్: ఉత్తమ పౌర సమాజ నిర్మాణమే జన విజ్ఞాన వేదిక లక్ష్యమని ఆ వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి కష్ణాజీ అన్నారు. సోమవారం పార్వతీపురంలోని ఆర్కే జూనియర్ కళాశాల, జనహిత డిగ్రీ కళాశాలలో ఆ వేదిక జిల్లా అధ్యక్షుడు వంగల దాలి నాయుడు అధ్యక్షతన అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన విద్యార్థులతో మాట్లాడుతూ రానున్న సమాజమంతా ఉత్తమ పౌరులతో నిండి ఉండాలన్న సంకల్పంతో జనవిజ్ఞాన వేదిక పనిచేస్తుందన్నారు. ప్రజల కోసం..ప్రగతి కోసం మూఢాచారాలు మూఢనమ్మకాల స్థానంలో సైన్స్‌ను సద్వినియోగం చేయాలని కోరారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, గురువుల హితోపదేశాన్ని ఆచరించి లక్ష్యసాధన కోసం శ్రమించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. పార్వతీపురం విద్యార్థులు ముందుకు వస్తే ఉద్యోగ పోటీ పరీక్షలకు అవసరమైన ఉచిత కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు, ప్రముఖ కవి రచయిత గంటేడ గౌరునాయుడు, ప్రిన్సిపాల్ అప్పలనాయుడు, జి.ప్రశాంత్ కుమార్ తో పాటు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలక రంజిత్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ధనాల మౌళి, కోశాధికారి కొండ గౌరి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ సమావేశం రేపు



మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించిన ఎస్సీ సెల్ అనుబంధ విభాగాల నాయకులు

పార్వతీపురం రూరల్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, అలాగే స్థానిక మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం 3గంటలకు జిల్లా కేంద్రంలో గల ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో జరిగే వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని జిల్లా ఎస్సీసెల్ నాయకులు పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్ బాబు పాల్గొంటారని తెలిపారు. ఈ మేరకు పార్వతీపురం నియోజకవర్గం పరిధిలో ఉన్న ఎస్సీ సెల్ అనుబంధ విభాగాలు, నియోజకవర్గ స్థాయి పలు అనుబంధ విభాగాలు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి పార్టీ పలు విభాగాల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు కార్యక్రమ కార్యాచరణ నిమిత్తం మాజీ ఎమ్మెల్యే జోగారావు క్యాంపు కార్యాలయంలో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ఎస్సీసెల్ అధ్యక్షుడు సరివిశెట్టి శ్రీనివాసరావు, నియోజకవర్గ విభాగం అధ్యక్షుడు కోల సుధాకర్, కౌన్సిల్ సభ్యుడు నిమ్మకాయల సుధీర్, నేతాజీ, గండి భాగ్యలక్ష్మి, పార్టీ రాష్ట్ర ఆర్టీఐ వింగ్ నాగరాజు, మండల ఎస్సీసెల్ నాయకుడు గంగరాజు, శ్రీనివాసరావు, పోల క్రాంతి, శివుడు, గండి లక్ష్మి, గండి ప్రభావతి, చింతగడ లక్ష్మి, జితేంద్ర, రాజేష్, ఆనంద్, శ్రీకాంత్, మరికొంతమంది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి దాతల తోడ్పాటు



విద్యార్థుల నగదు, మెరిట్ సర్టిఫికెట్స్‌ను హెచ్‌ఎంకు అందజేస్తున్న లెంక కుటుంబీకులు

సీతానగరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2024–25 విద్యాసంవత్సరంలో టెన్త్‌లో అధికమార్కులు సాధించిన విద్యార్థులకు హెచ్‌ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో పెదభోగిలి మాజీ సర్పంచ్ లెంక రాములు పేరున వారి కుటుంబసభ్యులు నగదు ప్రోత్సాహకం, ప్రశంసా పత్రాలు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా పెదబోగిలి మాజీ సర్పంచ్ లెంక లక్ష్మితో పాటు కుమారులు విద్యాసాగర్, రమేష్, అప్పారావు మాట్లాడుతూ ఇక్కడి స్కూల్‌లో టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తామని ఇదివరలో ప్రకటించామన్నారు. ఈ మేరకు మాజీ సర్పంచ్ లెంకరాములు జ్ఞాపకార్థం స్థానిక ఉన్నత పాఠశాలలో నగదు మెరిట్ సర్టిఫికెట్స్ ఇచ్చినట్లు తెలిపారు. ప్రథమ బహుమతిగా దాసరి శ్రీదేవికి రూ.3 వేలు, ద్వితీయ బహుమతిగా తాన్న అవిష, బీజ తేజశ్వీలకు రూ.2 వేలు వంతున నగదు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

జమ్ము కశ్మీర్‌లో ఉన్న మా కుమారుడిని తీసుకురండి

- పీజీఆర్ఎస్‌లో జేసీని కోరిన యువకుడి తల్లి



పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న యువకుడి తల్లి చిన్నమ్మి

పాచిపెంట: తప్పిపోయి జమ్ము కశ్మీర్‌లో ఉన్నో తమ కుమారుడిని తీసుకురావాలని పాచిపెంట మండలంలోని యారడ్లవలస గ్రామానికి చెందిన బడ్నాన చిన్నమ్మి, సీపీఎం నాయకులు కోరాడ ఈశ్వరరావుతో కలిసి పార్వతీపురం కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈనెల నాలుగవ తేదీన తమ కుమారుడు జమ్ముకశ్మీర్‌లో ఉన్నాడని తెలిసి, తమకు ఆర్థిక స్తోమత లేక కలెక్టర్ స్పందించి, తీసుకురావాలని కోరుతూ పత్రికా ముఖంగా కలెక్టర్‌ను ఆమె కోరింది. మరునాడు 5 వ తేదీన సాక్షి పేపర్‌లో వచ్చిన వార్త చూసి స్థానిక ఎంపీపీ బి.ప్రమీల కలెక్టర్‌తో మాట్లాడి చిన్నారావును తీసుకు వచ్చే ప్రయత్నం చేయాలని కోరారు. దీనికి స్పందించిన కలెక్టర్ వెంటనే తీసుకు వచ్చే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. అదే రోజు రెవెన్యూ సిబ్బందిని బాధితుల ఇంటికి పంపించి వివరాలు సేకరించారు. నాటి నుంచి ఈరోజు వరకు ఈ విషయంపై కలెక్టర్ కార్యాలయం నుంచి కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం రాకపోవడంతో సోమవారం మళ్లీ పీజీఆర్ఎస్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై కసరత్తు చేస్తున్నామని జాయింట్ కలెక్టర్, ఇతర జిల్లా అధికారులు ఆమెకు తెలియజేశారు.

ఇంటి స్థలాల దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ వైశాలి

మక్కువ: ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులు గతంలో అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం పార్వతీపురం సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి మండలంలోని కవిరిపల్లి, వెంకటభైరిపురం, మక్కువ గ్రామాల్లో పర్యటించి ఇంటి స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను రెవెన్యూ అధికారులు, గృహ నిర్మాణ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాస్తవాలను తెలుసుకోవడంతో పాటు అర్హత గల లబ్ధిదారుల దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారులతో సబ్‌కలెక్టర్ వైశాలి మాట్లాడుతూ అర్హులకు తప్పకుండా సంక్షేమ ఫలాలు అందుతాయని, ఎవరూ ఆందోళన చెందనవసరం లేదని భరోసా ఇచ్చారు. ఈ పర్యటనలో గృహ నిర్మాణశాఖ సిబ్బంది, ఇతర సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.